

గ్రేవ్ కేసులు ఛేదించాలి

జిల్లాలోని గ్రేవ్ కేసులను ఈ నెలాఖరులోపు ఛేదించాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు. - 8లో



ఘనంగా ఎంబీయూ స్నాతకోత్సవం

మోహన్‌బాబు యూనివర్సిటీలో రెండో స్నాతకోత్సవం, గ్రాడ్యుయేషన్ డే శనివారం ఘనంగా నిర్వహించారు. - 8లో

ఔషధ మొక్కల పెంపకం అవసరం



ఔషధ మొక్కల పెంపకం ప్రతి ఒక్కరికీ అవసరమని ఎస్వీయూ వీసీ అప్పారావు అన్నారు. ఎస్వీయూలో శనివారం ఔషధ మొక్కల పెంపకం సవాళ్లు అనే అంశంపై సదస్సు జరిగింది. - 8లో

న్యూస్‌రీల్

పీజీఆర్ఎస్ రేపు

తిరుపతి అర్బన్: స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఆర్వో నరసింహులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా మండల స్థాయి అధికారులు తప్పకుండా తమ పరిధిలో ప్రతి సోమవారం గ్రీవెన్స్ నిర్వహించాలని పేర్కొన్నారు. అలాగే డివిజన్ స్థాయి అధికారులు తమ పరిధిలో తప్పకుండా సోమవారం గ్రీవెన్స్ జరపాలన్నారు. అలాగే జిల్లా స్థాయి అధికారులు కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌కు విధిగా హాజరుకావాలని స్పష్టం చేశారు. కాగా గ్రీవెన్స్‌లో మీరు ఇచ్చిన అర్జీలు ఏ స్థితిలో ఉన్నయో తెలుసుకోవడానికి, ఏదైనా సందేహాలు ఉంటే నివృతి చేసుకోవడానికి, కొత్తగా ఫిర్యాదులు చేయడానికి 1100 కాల్ సెంటర్ నంబర్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

స్కూళ్లలోకి అనధికారిక వ్యక్తులకు ప్రవేశం నిషేధం

తిరుపతి అర్బన్: పాఠశాలలు, హాస్టళ్ల ఆవరణలోకి అనధికారిక వ్యక్తులకు అనుమతులు లేవని కలెక్టర్ వెంకటేశ్వర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ మేరకు రాష్ట్ర పాఠశాల విద్యా సంచాలకుడు విజయరామరాజు నుంచి ఉత్తర్వులు వచ్చాయని స్పష్టం చేశారు. తక్షణమే ఈ రూల్స్ అమల్లోకి వస్తాయని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలలు, ఎయిడెట్ పాఠశాలలు, కేజీబీవీలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్లకు ఈ నిబంధనలు వర్తిస్తాయని చెప్పారు. విద్యార్థులకు కానుకలు ఏమైనా ఇవ్వాలన్న ముందస్తు అనుమతులు తీసుకున్న తర్వాతే వెళ్లాల్సి ఉంటుందని చెప్పారు. అయితే విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల కమిటీ సభ్యులకు మాత్రమే పాఠశాలలు, హాస్టళ్లకు వెళ్లడానికి అనుమతి ఉంటుందన్నారు. అలాగే రాజకీయ పార్టీలకు చెందిన నేతలు, పార్టీ జెండాలు, కండువాలతో వెళ్లకూడదని పేర్కొన్నారు. ఒక వేళ వెళ్లితే పాఠశాల హెచ్ఎంలు, ప్రిన్సిపాళ్లు, వార్డన్లపై చర్యలుంటాయన్నారు.

ఎస్వీయూలో బీటెక్ (స్వీడన్) ప్రవేశాలకు ఆహ్వానం

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ (స్వీడన్) కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం– స్వీడన్‌లోని ' బ్లెకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ'తో జరిగిన పరస్పర అంగీకార ఒప్పందం ప్రకారం ఎస్వీయూ బీటెక్ నాలుగేళ్ల కోర్సు కొనసాగుతోందని తెలిపారు. అయితే ఈ ప్రోగ్రాం మూడేళ్లు ఎస్వీయూలో, ఒక సంవత్సరం స్వీడన్‌లోని బ్లెకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో విద్యార్థులు చదవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కావున 2025–26 విద్యా సంవత్సరానికి ఈ ప్రోగ్రాంలో చేరదలచిన విద్యార్థులు ఈనెల 4 వ తేదీ నుంచి 14 వతేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్ల విభాగం ద్వారా ఆసక్తిగల విద్యార్థులు ఈ కోర్సులో ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

'అంతన్నారు..ఇంతన్నారు.. అధికారం ఇచ్చాం .. ప్రభుత్వం కొలువుదీరి ఏడాది గడిచింది.. ఉపాధ్యాయులు, ఉద్యోగులకు చేస్తామన్న సాయం ఊసేలేదు.. గురువులకు కనీస గౌరవం కూడా లేదు.. టీచర్లను బోధనకు పరిమితం చేయాల్సి ఉండగా అనవసర యాప్‌లను నెత్తిన రుద్ది.. బోధనకు అంతరాయం కలిగిస్తున్నారు.. అయ్యోర్లను అన్ని రకాలుగా ఇబ్బందులు పెట్టడం ఎంత వరకు న్యాయం'. అని ఉపాధ్యా సంఘాల నేతలు ప్రశ్నించారు. ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



తిరుపతి ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య నేతలు

ఎంతవరకు న్యాయం?

ఉపాధ్యాయులపై పాలకులకు నిర్లక్ష్యం తగదు

- గురువులను విద్యాబోధనకు పరిమితం చేయండి
- అనవసరమైన యాప్‌ల నుంచి విముక్తి కల్పించండి
- డిమాండ్లు పరిష్కరించకుంటే మరింతగా ఉద్యమిస్తాం
- తిరుపతి వేదికగా ఉపాధ్యాయ సంఘాల హెచ్చరిక

తిరుపతి రూరల్: తిరుపతి నగరంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో టీచర్లు శనివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ, ఏపీఎస్‌టీఎఫ్ అధ్యక్షులు కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఉపాధ్యాయుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాది గడిచినా ఒక్క సమస్యనూ పరిష్కరించలేదన్నారు. బోధనాపరమైన పనులను పక్కన పెట్టి, అనవసరమైన యాప్‌లను చేతికిచ్చి విద్యార్థులకు చదువులను దూరం చేస్తోందన్నారు. ప్రభుత్వం తన పారదర్శకతను చూపించాలనుకునే ముసుగులో విద్యార్థులకు చదువులను దూరం చేయించడం భావ్యం కాదన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించలేని ప్రభుత్వం అన్ని విధాలుగా ఇబ్బందులు పడాల్సి వస్తుందని హెచ్చరించారు.



ధర్నాలో పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళా ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుల డిమాండ్లు ఇవీ..

11వ పీఆర్సీ బకాయిలను చెల్లించాలి. 12వ పీఆర్సీ అమలుకు కమిటీ వేయాలి. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను విడుదల చేయాలి. రిటైర్డ్ అయిన ఉపాధ్యాయులకు ఇచ్చే అలవెన్సులు తక్షణం చెల్లించాలి. బోధనకు అంతరాయం కలిగిస్తున్న యాప్‌లను రద్దు చేయాలి. ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలి. ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలు చేయాలి. అంతర్ జిల్లాల ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలి. ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయుల వేతనాలను సకాలంలో చెల్లించాలి.

కార్యకర్తలకు ఇచ్చిన గౌరవం కూడా లేదు

'తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక పల్నాడు జిల్లాలో ఓ టీడీపీ కార్యకర్తను మరో పార్టీ వారు చంపేస్తే..ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడానికి క్యాబినెట్ ఆమోదం చేసి..రెండు నెలల్లో ఉద్యోగం ఇచ్చారు.. అదే ఒక ఉపాధ్యాయుడు అనారోగ్యంతోనో, ప్రమాదంలోనో చనిపోతే ఆ కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం ఇవ్వడానికి సంవత్సరాల తరబడి వేచి చూడాలి.. ఒక కార్యకర్తకు ఇచ్చిన గౌరవం కూడా గురువులకు ఇవ్వలేరా..?' అని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు ఎవరైనా చనిపోతే వారి కుటుంబ సభ్యులకు చదువుకు తగ్గ ఉద్యోగం ఇచ్చే అధికారాన్ని జిల్లా కలెక్టర్‌కు అప్పగించాలని డిమాండ్ చేశారు. కుటుంబ పెద్దగా ఉన్న ఉపాధ్యాయుడు చనిపోయిన రెండు నెలల్లో ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం వచ్చేలా నిబంధనలు సడలించాలని కోరారు. ఈ ధర్నాలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి చిరంజీవి, తిరుపతి అధ్యక్షుడు ఎస్.సురేష్, ముత్యాలరెడ్డి, జగన్నాథం, నిర్మల, రేణుకా దేవి, వెంకటరమణ, మురళీకృష్ణ, బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

మాట ఇచ్చారు.. మరిచారు



ఉపాధ్యాయుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని ఎన్నికలకు ముందు మాట ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక ఆ మాట మరిచారు. ఇప్పుడు ఉపాధ్యాయ సంఘాల తరపున గుర్తు చేస్తున్నా లెక్క చేయడం లేదు. అందుకే రోడ్డుపైకి వచ్చి ధర్నాలు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం ఉపాధ్యాయుల చూపించే నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తున్నా. – అవనిగడ్డ పద్మజ, యూటీఎఫ్ నాయకురాలు, తిరుపతి

మూల్యం తప్పదు



గురువులను బాధించే ఏ ప్రభుత్వమైనా తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడానికి ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. బోధనకు దూరం చేసి బోధనేతర పనులు చేయించడం వల్ల విద్యార్థుల భవిష్యత్తు నాశనమవుతోంది. ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలి. – రేణుకాదేవి, ఎస్టీయూ జిల్లా నాయకురాలు, తిరుపతి

మా పోరాటం ఆగదు



సమస్యలను పరిష్కరించేంత వరకు మా పోరాటం ఆగదు. కొత్త ప్రభుత్వం కొలువుదీరి ఏడాది గడిచినా మా సమస్యలు గుర్తు రావడం లేదు. ఎన్నికలకు ముందు అన్నీ చేస్తామని చెప్పి, ఇప్పుడు కాలయాపన చేస్తున్నారు. గురువులను బాధ పెట్టడం ఎవరికీ మంచిది కాదు. –రమణారెడ్డి, ఉపాధ్యాయుడు, తిరుపతి రూరల్

సాయం చేస్తామని.. చేతులెత్తేశారు!



గత ఎన్నికల సమయంలో ఉపాధ్యాయులందరికీ ఏ సమస్య వచ్చినా పరిష్కరిస్తామని, పని ఒత్తిడి లేకుండా నాణ్యమైన చదువులు పిల్లలకు అందించేలా చూస్తామని చెప్పారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలను అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో ఇచ్చేస్తామన్నారు. ఏడాది గడిచినా ఇవ్వలేదు. – దేవేంద్ర, ఉపాధ్యాయుడు, తొట్టంబేడు మండలం

మా డిమాండ్లను పరిష్కరించాల్సిందే



ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాల్సిందే. ప్రభుత్వం గురువులపై బాధ్యతగా వ్యవహరించాలి. బోధనకు పరిమితం చేసి పిల్లల భవిష్యత్తు బాగుపడేలా చూడాలి. అంతే తప్ప అనవసరమైన యాప్‌లను చేతికి అందించి అందులో ఫొటోలు పెట్టే బాధ్యతలు అప్పగించడం మంచిది కాదు. – ప్రభు, కార్యదర్శి, యూటీఎఫ్

రోడ్డెక్కే పరిస్థితికి తీసుకువచ్చారు



కొత్త ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచింది. తమ సమస్యల గురించి ప్రస్తావించినా పాలకులు పట్టించుకోలేదు. తమ డిమాండ్లను తీర్చుకోవడానికి రోడ్డెక్కే పరిస్థితికి తెచ్చారు. ఇంత త్వరగా పోరాటం చేయాల్సి వస్తుందని అనుకోలేదు. అయినా మాకు తప్పడం లేదు. ఇలా చేయడం పాలకులకు న్యాయం కాదు. – డి.నిర్మల, యూటీఎఫ్ నాయకురాలు, తిరుపతి

నమ్మించి మోసం చేస్తోంది



ఉపాధ్యాయులపై ప్రభుత్వం నిర్లక్ష్యం ధోరణి అవలంభిస్తోంది. ఎన్నికలకు ముందు అన్నీ చేస్తామని చెప్పి నమ్మించింది. ఇప్పుడు ఏడడిగినా సమాధానం లేకుండా మోసం చేస్తోంది. పది మందికి చదువు చెప్పే తమ పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు దుర్మార్గంగా ఉంది. ఏ సమస్య చెప్పినా లెక్క చేయడం లేదు. అందుకే ఐక్యతతో పోరాడుతున్నాం. – పి.కవిత, యూటీఎఫ్ నాయకురాలు, తిరుపతి

కలిసికట్టుగా పోరాడుతున్నాం



ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వానికి పదే, పదే నివేదికలు అందించాం. పరిష్కరించాలని పలు మార్లు విజ్ఞప్తి చేశాం. అయినా లెక్క చేయలేదు. ఉపాధ్యాయులపై అగౌరవంగా వ్యవహరించే ఈ ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలని పోరాడుతున్నాం. పోరాటంతోనే సాధించుకుంటాం. – ఎస్.సురేష్, ఫ్యాప్టో అధ్యక్షులు, తిరుపతి

దిగివచ్చేంత వరకు ఉద్యమిస్తాం



ఉపాధ్యాయుల సమస్యలపట్ల ప్రభుత్వం దిగివచ్చేంత వరకు ఉద్యమిస్తాం. అన్ని ఉపాధ్యాయ సంఘాలు ఏకమై చేస్తున్న ఈ పోరాటానికి ప్రభుత్వం దిగిరాకతప్పదు. ఉపాధ్యాయుల సమస్యలపై పాలకులు చిత్తశుద్ధితో వ్యవహరించ లేదు. అందుకే వీధుల్లోకి రావాల్సి వచ్చింది. – బి.మధుసూదన్‌రెడ్డి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి

విద్యార్థులు నష్టపోక తప్పదు



చదువులు చెప్పే ఉపాధ్యాయులు రోడ్డెక్కితే విద్యార్థులు నష్టపోక తప్పదు. ప్రభుత్వం ఇంత త్వరగా చెడ్డపేరు తెచ్చుకుంటుందని అనుకోలేదు. ఉపాధ్యాయులే రోడ్డుపైకి వస్తే మిగతా వారి పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ఆరు నెలల్లో సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి ఏడాది దాటినా ఏమీ అనుకోలేదు. అందుకే ఆందోళనలు చేయాల్సి వస్తోంది. – శ్రీదేవి, యూటీఎఫ్ నేత, కేవీబీ పురం

అక్రమ అరెస్టులతో ప్రజాభిమానం ఆపలేరు

- పెద్దిరెడ్డి గన్‌మెన్‌ను అకారణంగా సస్పెన్షన్ చేశారు
- మరి అవినీతి పోలీసులపై చర్యలేవీ?
- జిల్లా జైలులో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో ములాఖత్ అయిన భూమన కరుణాకరరెడ్డి, నారాయణస్వామి, విజయానందరెడ్డి
- కట్టమంచి చెరువులో ఇసుక అక్రమ తవ్వకాల పరిశీలన



విలపిస్తున్న కార్యకర్తల కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతున్న కరుణాకరరెడ్డి, నారాయణస్వామి, విజయానందరెడ్డి


చిత్తూరు కార్పొరేషన్ : బంగారుపాళెంలో మామిడి రైతుల పరామర్శకు అధినేత జగనన్న వచ్చినప్పుడు ఓ పత్రికా ఫొటోగ్రాఫర్‌పై దాడి చేశారని, విజయానందరెడ్డి జన్మదినం సందర్భంగా నగరంలో కేక్ కట్ చేశారని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను జిల్లా జైలులో పెట్టారు. వీరిని శనివారం తిరుపతి, చిత్తూరు జిల్లాల పార్టీ అధ్యక్షుడు కరుణాకరరెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా జైలులో పార్టీ నాయకులు ఆను, కార్యకర్తలు చక్రవర్తి, వినోద్, మోహన్, అబ్దుల్, రాజేష్, అరుణ్, సతీష్, అల్తాఫ్, రఘుతో ములాఖత్ అయ్యారు. అనంతరం వారి కుటుంబ సభ్యులు నాయకులను చూసి కన్నీటి పర్యంతమయ్యారు. వారిని ఓదార్చి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా కరుణాకరరెడ్డి మీడియాతో మాట్లాడారు. బంగారుపాళ్యం ఘటనలో చక్రవర్తిని జులై 10న అరెస్టు చేసి 13న కోర్టులో ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. 13నే అదుపులో తీసుకున్నట్లు కోర్టులో చెప్పాలని పోలీసులు అతడిపై ఒత్తిడి తెచ్చినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. విజయానందరెడ్డి జన్మదిన వేడుకలను జరుపుకున్నారని తమ పార్టీ కార్యకర్తలపై టీడీపీ నాయకులు దాడి చేసి ఇళ్లు ధ్వంసం చేసి కేసులు పెట్టి జైలులో పెట్టారన్నారు. విజయానందరెడ్డికి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి అణచివేసేందుకు అధికార పార్టీ ఇలా కుట్ర పన్నుతోందన్నారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం కూటమి నాయకులకు నచ్చడం లేదన్నారు. మానసికంగా వేధించడానికి ఇలాంటి అక్రమ కేసులు పెట్టించారన్నారు. కార్యకర్తల విచారణలో విజయానందరెడ్డి దాడి చేయించారని బాధితుల వద్ద తప్పుడు వాంగ్మూలం తీసుకోవాలని పోలీసులు ప్రయత్నించారని ఆరోపించారు.

అవినీతి పోలీసులపై చర్యలేవీ?


చంద్రబాబుకు అనుకూల పత్రికలో చిత్తూరు పోలీసుల అవినీతిపై కథనం వచ్చిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. బంగారుపాళ్యం టోల్‌గేటు వద్ద పోలీసులు ప్రైవేటు సైన్యంతో దారి దోపిడీ ముఠా అని పెట్టారని అభియోగించారు. వారు ఇచ్చిన సమాచారంతో వీరు గుట్కా, నిషేధిత పదార్థాల నిర్వాహకుల నుంచి లక్షలు దోచుకుంటున్నారన్నారు. అక్రమదారుల నుంచి లక్షలు దోచుకుంటున్నట్లు పత్రికల్లో వస్తున్న వాటిపై ఎస్పీ కఠినంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి చేయి బాగాలేకపోతే ఆయన బ్యాగ్ మోసినందుకు గన్‌మెన్‌ను సస్పెండ్ చేసిన విషయం గుర్తు చేశారు. స్మగ్లర్లతో బేరాలు చేసుకొని వసూళ్లు చేస్తున్న పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

కట్టమంచి చెరువు పరిశీలన

జిల్లా కేంద్రంలోని కట్టమంచి చెరువులో పూడిక తీత పనుల పేరిట భారీ ఎత్తున దోపిడీ జరుగుతోందని విజయానందరెడ్డి విమర్శించారు. శనివారం క్షేత్రస్థాయిలో చెరువు వద్ద జరుగుతున్న మట్టి అక్రమ తవ్వకాలను విజయానందరెడ్డి, తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు కరుణాకరరెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామిలకు చూపించి సమస్యను తెలియజేశారు. రోజు లారీ, టిప్పర్లతో వందలాది లోడ్‌లు ఇటుక బట్టీలకు, గృహ, లే అవుట్ల నిర్మాణాలకు ఇష్టారాజ్యంగా తరలిస్తున్నారన్నారు. వీటికి సరైన లెక్కా పక్కా లేకుండా చెరువులో అక్రమంగా మట్టిని అమ్ముకుంటున్నారన్నారు. వీటిపై మీడియాలో కథనాలు వచ్చినా అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నరన్నారు. ఆయకట్టు సామర్థ్యం, జలవనరులశాఖ వారు ఇచ్చిన అనుమతి కంటే ఎక్కువగా మట్టి తరలిస్తున్నారని ఆరోపించారు. భవిష్యత్తులో వర్షాలకు, తుపాను, ఇతర కారణాలకు చెరువు కట్ట తెగిపోతే కట్టమంచి కొట్టుకుపోతుందని అభిప్రాయపడ్డారు. రోజు వందలాది లోడ్‌లు మట్టి తవ్వుతున్నారన్నారు. దీని ద్వారా ఎమ్మెల్యేకు లక్షల్లో ఆదాయం వస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు సూర్యప్రతాప్‌రెడ్డి, హరీషారెడ్డి, అంజలిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మురళీరెడ్డి, రాజేష్, వెంకట్‌రెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, సుగుణశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.




చెరువులో జేసీబీల సాయంతో టిప్పర్లకు అక్రమంగా తరలుతున్న ఇసుక



అరెస్టయిన కార్యకర్తలను పరామర్శించడానికి జైలుకు వస్తున్న కరుణాకరరెడ్డి, నారాయణస్వామి, విజయానందరెడ్డి

యూపీఎస్సీ పరీక్షలకు పటిష్ట చర్యలు



మాట్లాడుతున్న డీఆర్వో నరసింహులు

తిరుపతి అర్బన్: యూపీఎస్సీ సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ పరీక్షలకు పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని డీఆర్వో నరసింహులు తెలిపారు. పరీక్షలకు నిర్వహణపై కలెక్టరేట్‌లో శనివారం ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం పరీక్షలు రెండు సెంటర్లలో మాత్రమే నిర్వహిస్తున్నామని వెల్లడించారు. అయితే 641 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారని చెప్పారు. పేపర్–1 ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, పేపర్–2 మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు. తిరుపతిలోని శ్రీపద్మావతి బాలికల ఉన్నత పాఠశాల, ఎస్పీడబ్ల్యూ డిగ్రీ కళాశాల సమీపంలోని శ్రీపద్మావతి ఉమెన్స్ జూనియర్ కళాశాలలోని వింగ్–ఏలో పరీక్షలు ఉంటాయన్నారు. యూపీఎస్సీ అబ్జర్వర్ శరద్‌కుమార్ శ్రీ వాస్తవ, జాయింట్ సెక్రటరీ శివకుమార్ పాల్గొన్నారు.

పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగం కమిటీ నియామకం

తిరుపతి మంగళం : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల్లో పలువురిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శులుగా ఎ.కిషోర్‌కుమార్‌రెడ్డి (పూతలపట్టు), పి.సందీప్‌రెడ్డి(సత్యవేడు), ఎం.మధుసూదన్ రెడ్డి(పుంగనూరు), టి.మల్లికార్జునగౌడ్(శ్రీకాళహస్తి), క్రిస్టియన్, మైనార్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఆర్.నందకుమార్(చిత్తూరు), చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శిగా కె.ఇ.అయప్పన్(నగిరి)కి చెందిన వారు నియమితులయ్యారు.

క్లుప్తంగా

బళ్లారి రాఘవాచారి సేవలు అభినందనీయం



బళ్లారి రాఘవ జయంతి కార్యక్రమంలో డీఆర్వో, కలెక్టరేట్ ఉద్యోగులు

తిరుపతి అర్బన్: రంగస్థలం నాటకాలకు బళ్లారి రాఘవాచారి అందించిన సేవలు అభినందనీయమని డీఆర్వో నరసింహులు కొనియాడారు. కలెక్టరేట్ కార్యాలయంలో శనివారం బళ్లారి రాఘవాచారి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బళ్లారి రాఘవాచారి తెలుగు నాటక రంగంలో ప్రముఖ వ్యక్తిగా గుర్తింపు పొందారని చెప్పారు. అలాగే సినిమా రంగంలోనూ తన రచనలతో ప్రసిద్ధి చెందారన్నారు. నాటక రంగంలో ఎన్నో పాత్రల్లో నటించి మంచి పేరును పొందారని గుర్తు చేశారు. రాయలసీమలో జన్మించిన రాఘవాచారి రంగస్థలంలో తన నటనతో ఉన్నత శిఖరాలను అధిరోహించారని తెలిపారు.

ఔషధ మొక్కల పెంపకం అవసరం

తిరుపతి సిటీ: ప్రతి ఒక్కరికీ ఔషధ మొక్కల పెంపకం అవసరమని ఎస్వీయూ వీసీ ఆచార్య అప్పారావు పేర్కొన్నారు. ఎస్వీయూ సెనేట్ హాల్‌లో శనివారం బోటనీ విభాగం, శ్రీ రాధా కృష్ణ ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో 'ఔషధ మొక్కల పెంపకం- సవాళ్లు' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దైనందిన జీవితంలో ఆయుర్వేదిక్ ఔషధాలు మన జీవనంలో జీవితంలో ఒక భాగం కావాలని సూచించారు. ప్రాచీన కాలంలో ఉపయోగించిన యునానీ, ఆయుర్వేదిక్, సిద్ధ, తదితర పద్ధతులను అవలంబించాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా ఆయుర్వేద మందులు వాడుతున్నానని, ఎటువంటి ఇంగ్లిష్ మందులు, అల్లోపతి మందులు వాడడం లేదని, అందుకే ఇంత ఆరోగ్యంగా ఉన్నానన్నారు. ఈ సదస్సులో ఏపీ మెడిసిన్ ప్లాంట్స్ సీఈఓ చంద్రశేఖర్, డాక్టర్ రేణు దీక్షిత్, డాక్టర్ విజయ, డాక్టర్ కామాక్షమ్మ, టి గంగాధరం పాల్గొన్నారు.

గృహహింస కేసుల్లో ప్రభుత్వ అధికారులతోనే కౌన్సెలింగ్

తిరుపతి అర్బన్: గృహహింస చట్టానికి సంబంధించిన కౌన్సెలింగ్ కేసులు మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు మాత్రమే కౌన్సెలింగ్ నిర్వహిస్తారని శనివారం ఓ ప్రకటనలో ఐసీడీఎస్ పీడీ వసంతబాయి వెల్లడించారు. అంతేతప్ప ఎటువంటి ఎన్జీవోస్.నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్ వారు భాగస్వాములు కావడం లేదని స్పష్టం చేశారు. కేవలం ప్రభుత్వం ద్వారా నియమించిన వారు మాత్రమే కేసుల విచారణలో ఉంటారన్నారు.

చోరీకి యత్నించిన వ్యక్తిని పోలీసులకు అప్పగింత

నాయుడుపేటటౌన్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రయాణికుడి నుంచి సెల్ ఫోన్ చోరీ చేయడానికి యత్నించిన వ్యక్తిని స్థానికులు శనివారం పట్టుకుని పోలీసులకు అప్పగించారు. బస్టాండ్ వద్ద ఓ వృద్ధుడి జేబులో ఉన్న సెల్‌ఫోన్‌ను చోరీ చేస్తుండగా అతడు గుర్తించి, కేకలు వేశాడు. దీంతో ప్రయాణికులు చోరీకి యత్నించిన వ్యక్తిని పట్టుకున్నారు. అతని పాటు ఉన్న మరో వ్యక్తి పరారయ్యాడు. పట్టుకున్న వ్యక్తిని పోలీసుకు అప్పగించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేదిక.. కార్యక్రమం ఒకటే..

నిర్వహణ రెండుసార్లు

- అటు ఎమ్మెల్యే, ఇటు ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్‌తో అన్నదాత సుఖీభవ
- సత్యవేడులో సర్వత్రా చర్చనీయాంశం
- తారస్థాయికి చేరుతున్న పచ్చనేతల మధ్య విభేదాలు



సత్యవేడులో రైతులకు మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే



అన్నదాత సుఖీభవలో బాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్

వరదయ్యపాళెం: నియోజకవర్గ కేంద్రమైన సత్యవేడులో నిర్వహించిన అన్నదాత సుఖీభవ కార్యక్రమం సర్వత్రా విమర్శలకు దారి తీసింది. ఒకే కార్యక్రమాన్ని ఒకే వేదికపై వేర్వేరుగా రెండుసార్లు నిర్వహించడం ఏమిటని సత్యవేడులో స్థానికులు చర్చించుకున్నారు. శనివారం ఉదయం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సత్యవేడులోని బేరిశెట్టి కల్యాణ మండపంలో వ్యవసాయశాఖ అధికారులతో కలసి అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని నిర్వహించి, మెగా చెక్కును రైతులకు అందజేశారు. అదే కార్యక్రమాన్ని మధ్యాహ్నం పైన మరోమారు బేరిశెట్టి కల్యాణ మండపంలోనే నియోజకవర్గ పార్టీ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్‌గా నియమితులైన శంకర్ రెడ్డి సమక్షంలో నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. ఏడు మండలాల పార్టీ శ్రేణులతో కలసి అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీడీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నరసింహ యాదవ్ హాజరయ్యారు. అలాగే వ్యవసాయశాఖ అధికారులు కూడా ఈ కార్యక్రమానికి హాజరు కావడం గమనార్హం. పార్టీ నాయకులు నిర్వహించిన కార్యక్రమానికి అధికార యంత్రాంగం ఎలా హాజరవుతారని అక్కడ స్థానిక ప్రజలు ప్రశ్నించడంతో పాటు చర్చించుకున్నారు.

సత్యవేడు టీడీపీలో తారస్థాయికి చేరుతున్న విభేదాలు

ఇటీవల సత్యవేడు టీడీపీ ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్‌గా తిరుపతికి చెందిన వ్యాపారవేత్త శంకర్‌రెడ్డి నియామకంతో సత్యవేడు టీడీపీలో సమస్యలు సమసిపోతాయన్న ఆశలు ఆవిరయ్యాయి. ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి, సిట్టింగ్ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మధ్య విభేదాలు రోజురోజుకు తారాస్థాయికి చేరుతున్నాయి. అందుకు నిదర్శనమే సత్యవేడు నియోజకవర్గ కేంద్రంలో శనివారం జరిగిన అన్నదాత సుఖీభవ అధికారిక కార్యక్రమాన్ని రెండు వర్గాలు వేర్వేరుగా నిర్వహించడం. అంతేకాక ఇటీవల సిట్టింగ్ ఎమ్మెల్యే సైతం నియోజకవర్గంలోని పలుచోట్ల పాత్రికేయ సమావేశాలు నిర్వహించి మరీ శంకర్ రెడ్డి వ్యవహార శైలిపై ఆగ్రహంతో ఊగిపోతున్నారు. ఎమ్మెల్యే వ్యవహార శైలికి దీటుగానే ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ శంకర్ రెడ్డి సైతం ఎమ్మెల్యేకు చెక్ పెట్టేలా పావులు కదుపుతున్నారు. ఆ దిశగా ఎమ్మెల్యే హాజరవుతున్న కార్యక్రమాలకు టీడీపీ శ్రేణులు హాజరు కాకుండా ఇప్పటికే శంకర్ రెడ్డి కట్టడి చేశారు. ఏడు మండలాల్లో సైతం ఎమ్మెల్యే ఎక్కడ హాజరైనా గతంలో ఆయన వెంట నడిచిన వారు సైతం నేడు హాజరు కాకుండా ముఖం చాటేస్తున్నారు. అంతేకాకుండా అధికారులను సైతం తమ వెంట నడిచేలా, తమ కనుసన్నల్లో పనిచేసేలా ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఇప్పిస్తున్నట్లు సమాచారం. ఏది ఏమైనప్పటికీ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే ఆదిమూలం ప్రాధాన్యతను పూర్తిగా తగ్గించే దిశగా ప్రత్యర్థి వర్గం పావులు కదుపుతోంది. దీంతో రానున్న రోజుల్లో పరిణామాలు ఎలా దారి తీస్తాయో వేచి చూడాలి మరి.

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి



అచ్చుతహేమంత్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు(ఇన్‌సెట్) అచ్చుత హేమంత్ (ఫైల్)

వెంకటగిరి రూరల్: పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్చుకునేందుకు పాఠశాలలకు వెళ్లిన విద్యార్థి చెరువులో ఈతకు వెళ్లి మృతి చెందాడు. ఈ ఘటన వెంకటగిరి పట్టణంలోని అమ్మవారిపేటలో శనివారం జరిగింది. వెంకటగిరి ఎగువ అరవపాళేనికి చెందిన అరవ మధు, మోహనమ్మ దంపతుల కుమారుడు అచ్చుత్‌హేమంత్(14) పట్టణంలోని రాణిపేట సమీపంలో ఉన్న జెడ్పీ హైస్కూలులో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం పాఠశాలకు వెళ్లిన విద్యార్థి తోటి విద్యార్థులు సుమారు 8 మందితో కలిసి, మధ్యాహ్నం సమయంలో పాఠశాల నుంచి ఎదురుగా ఉన్న చెరువులో ఈతకు వెళ్లారు. చెరువులో ఈత కొడుతుండగా అచ్చుత హేమంత్ మునిగిపోతుండడంతో గమనించిన తోటి విద్యార్థులు కేకలు వేయడంతో అక్కడే ఉన్న జాలరి ఆ విద్యార్థిని కాపాడి మందలించి పంపివేశారు. అయినప్పటికీ విద్యార్థులు మళ్లీ చెరువులో మునిగే ప్రయత్నం చేయగా అచ్చుత హేమంత్ గల్లంతయ్యాడు. భయభ్రాంతులకు గురైన తోటి విద్యార్థులు పాఠశాలకు చేరుకొని ఈతకు వెళ్లిన విషయం ఉపాధ్యాయులకు తెలిపారు. హెచ్‌ఎం ఈ విషయమై విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందించి, చెరువువద్ద గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించకపోవడంతో పాఠశాల హెచ్‌ఎం, విద్యార్థి తల్లిదండ్రులు వేర్వేరుగా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శనివారం గజఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టగా అచ్చుతహేమంత్ మృతదేహం లభించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి సిటీ: జవహర్ నవోదయ విద్యాలయలో 2026 -2027 విద్యా సంవత్సరానికి సంబంధించి 9వ, 11వ తరగతి ప్రవేశానికి జాతీయ స్థాయిలో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ విశ్వనాథ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షకు 2025–2026 విద్యా సంవత్సరంలో ఏదైనా ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యా సంస్థల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు 9వ తరగతిలోనూ, పదో తరగతి చదువుతున్న విద్యార్థులు 11వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. దరఖాస్తుల సమర్పించడానికి సెప్టెంబర్ 23 వతేదీ చివరి రోజు అని తెలిపారు. మరిన్ని వివరాలకు 8688888802, 9399976999 నంబర్లలో కానీ వరదరాజనగర్‌లోని విశ్వం సైనిక్ నవోదయ పోటీ పరీక్ష సమాచార కేంద్రంను సంప్రదించాలని కోరారు.

నెలాఖరుకల్లా గ్రేవ్ కేసులు ఛేదించాలి

- జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు
- పోలీసు అధికారులతో నేర సమీక్ష



సమావేశానికి హాజరైన పోలీసు అధికారులు

తిరుపతి క్రైమ్ : ఈ నెలాఖరుకల్లా జిల్లాలో ఉన్న గ్రేవ్ కేసులను ఛేదించాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశించారు. ఆయన శనివారం పద్మావతి మహిళా యూనివర్సిటీలోని సావేరి అతిథి గృహంలో అర్ధ సంవత్సర నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రధానంగా గ్రేవ్ కేసులు, ఎస్సీ, ఎస్టీ కేసులు, హౌస్ బ్రేకింగ్, వైట్ కలర్, మర్డర్ ఫర్ గేయిన్, రోడ్ యాక్సిడెంట్, ఎన్డీపీఎస్, సైబర్ నేరాలపై చర్చించామన్నారు.

- ఎస్టీ, ఎస్సీ కేసుల్లో వచ్చే ఫిర్యాదులు పూర్తి స్థాయిలో విచారించిన మీదట చర్యలు తీసుకోవాలన్నారు. ఈ చట్టాలపై పూర్తి స్థాయిలో ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసులపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.
- దొంగతనాల నియంత్రణపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఈ మధ్యకాలంలో 75 మంది నిందితులను అరెస్ట్ చేశామన్నారు. పాత నేరస్తులపై నిఘా ఉంచాలన్నారు. ఈ ఏడాదిలో డిటెక్షన్ 75 శాతం ఉండాలని, అదేవిధంగా రికవరీ 85 శాతం వరకు పెంచాలన్నారు. సైబర్ నేరాలు, వైట్ కలర్ నేరస్తులపై అప్రమత్తంగా వుండాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

హత్య కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

జిల్లా వ్యాప్తంగా మర్డర్ ఫర్ గెయిన్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి.. పురోగతి సాధించాలని పేర్కొన్నారు. డెకరేటివ్ కేసులు, దోపిడీ కేసులు పెండింగ్లో ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ కేసులన్నింటిని త్వరలో పూర్తి చేయాలన్నారు. రోడ్ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఒక ప్రాణాన్ని కాపాడితే ఆ కుటుంబానికి మేలు చేసిన వాళ్లం అవుతామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలపై ఉక్కు పాదం మోపాలని ఆదేశించారు. సమావేశంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ సంధ్యారాణి, కేదార్నాథ్, జయశేఖర్, ప్రేమ్ సాగర్, నిర్మల కుమారి, శిరీష, ఏఎస్పీలు రవి మనోహరాచారి, రామకృష్ణ, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎన్ఎస్‌యూలో భాషోత్సవ జాతీయ సదస్సు

- వర్సిటీలో 14 వరకు డేస్కాలర్స్‌కు స్పాట్ అడ్మిషన్లు
- ఈ ఏడాది వర్సిటీలో ఐకేఎస్ నూతన కోర్సు ప్రారంభం
- మీడియాతో వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి



మీడియాతో మాట్లాడుతున్న వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీ, ఉత్కల పీఠం సంయుక్తంగా ఆదివారం నుంచి మూడు రోజుల పాటు ప్రస్థానత్రయంలో భాషోత్సవం పేరుతో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి తెలిపారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ సంస్కృత వర్సిటీలో ఎన్ఈపీ-2020 విధానాన్ని అమలు చేస్తూ పలు నూతన కోర్సులను ప్రవేశపెట్టామన్నారు. డిగ్రీ ఆనర్స్‌తో పాటు రీసెర్చ్ ఓరియెంటెడ్ ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. యూజీ, పీజీ కోర్సుల్లో పదుల సంఖ్యలో మిగిలి ఉన్న సీట్లకు ఈ నెల 14 వరకు డేస్కాలర్స్‌కు స్పాట్ అడ్మిషన్లు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది నుంచి యూజీ, పీజీలో ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్ (ఐకేఎస్) కోర్సును ప్రవేశపెట్టినట్లు తెలిపారు. వర్సిటీలో నిర్మించిన శ్రీ స్వామినారాయణ సంప్రదాయ అక్షర పురుషోత్తమ మందిరాన్ని ఆదివారం ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. జాతీయ సదస్సుకు వీసీలు, ఒడిశా గవర్నర్, ఉత్తరాఖండ్ సీఎం హాజరవుతారని చెప్పారు. అలాగే స్వామినారాయణ సంప్రదాయ సంస్థలతో విశ్వవిద్యాలయం పరస్పర అవగాహనా ఒప్పందం చేసుకుని అమెరికా, ఇగ్లండ్, అబుదబి, నేపాల్లో ఉన్నటువంటి సంస్థలతో కలిసి విశేష పరిశోధనలు జరపనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ వెంకటనారాయణ, ఉత్కల పీఠం డైరెక్టర్ జ్ఞానరంజన్‌పండా, పీఆర్ఓ ప్రొఫెసర్ రమేష్ బాబు, ఏపీఆర్ఓ డాక్టర్ కనపాల కుమార్ పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ జమ



రైతులకు మెగా చెక్కు అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన అన్నదాత సుఖీభవ పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా శనివారం వారణాసి నుంచి పీఎం నరేంద్రమోదీ, రాష్ట్రం నుంచి సీఎం చంద్రబాబునాయుడు నగదు జమ కార్యక్రమాన్ని చేపట్టారు. అందులో భాగంగా శ్రీకాళహస్తి పట్టణం ఏపీసీడ్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి రైతులకు మెగా చెక్కు అందజేశారు. తిరుపతి జిల్లాలో 1,54,980 మంది రైతులకుగాను రూ.105 కోట్లు జమ చేశారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రూ.2 వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు మొత్తం రూ.7 వేలు అర్హులైన ప్రతి రైతుకూ అందుతుందన్నారు. ఖాతాల్లో జమకాని అర్హులైన రైతులను పరిశీలించి త్వరలోనే అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ, ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి, టీడీపీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ ప్రారంభం

పాకాల: మండలంలోని కె.ఒడ్డేపల్లి రైతుసేవా కేంద్రంలో రైతులకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని తిరుపతి జిల్లా జేసీ శుభం బన్సల్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శనివారం జేసీ మాట్లాడుతూ మండలంలో 5,029 మంది రైతులకు రూ.3.52 కోట్లు నిధులు రైతులకు పెట్టుబడి సాయం అందజేస్తున్నట్లు తెలిపారు. లబ్ధి పొందిన రైతులకు నగదు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి జమ అవుతుందన్నారు. అనర్హులైన రైతులకు వెబ్ ల్యాండ్‌కు అనుసంధానం లేని వాటికి, ఎన్‌పీసీఐ లింక్ లేనివారు లింక్ చేసుకోవాలని కోరారు. వెబ్‌ల్యాండ్ మ్యుటేషన్ త్వరితగతిన చేయాలని రెవెన్యూ శాఖ అధికారులకు సూచనలు చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు నంగా పద్మజారెడ్డి, నాయకులు సావిత్రి, సుధాకర్‌నాయుడు, మహేష్, సర్పంచ్ విజయలక్ష్మి, కావలివారి పల్లి సర్పంచ్ చెంగల్‌రాయులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యకు యత్నించిన యువకుడు సురేంద్ర

పాకాల: స్థానిక రైల్వేస్టేషన్‌లో రైలు కింద పడి యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శనివారం పాకాలలో చోటు చేసుకుంది. స్థానిక రైల్వే పోలీసుల కథనం మేరకు.. అనంతపురం జిల్లా, ఉరవకొండ మండలం ఉండబండ గ్రామానికి చెందిన ప్రకాష్ కుమారుడు సురేంద్ర నరసాపూర్ ఎక్స్‌ప్రెస్ కింద పడి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన ట్రైన్ డ్రైవర్ బ్రేకులు వేసి రైలును నిలిపి వేశారు. ఈ ఘటనలో ఆత్మహత్యకు యత్నించిన యవకుడు స్వల్పంగా గాయపడ్డాడు. గాయపడిన సురేంద్రని చికిత్స నిమిత్తం పి.కొత్తకోట సీహెచ్‌సీకి తరలించి, వైద్యం అందించినట్లు చిత్తూరు ఇన్‌చార్జ్ ఆర్పీఎస్ఐ రత్నమాల తెలిపారు.

ఘనంగా ఎంబీయూ స్నాతకోత్సవం

- ముఖ్యఅతిథిగా హాజరైన రాజ్యసభ సభ్యుడు ప్రఫుల్ పటేల్
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



రాజ్యసభ సభ్యుడు ప్రఫుల్ పటేల్‌తో ముఖ్య అతిథులను సత్కరిస్తున్న మోహన్‌బాబు, మంచు విష్ణు

చంద్రగిరి: మండలంలోని మోహన్‌బాబు యూనివర్సిటీ(ఎంబీయూ)లో శనివారం రెండో స్నాతకోత్సవం, 14వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంబీయూ చాన్సలర్ డాక్టర్ మంచు మోహన్‌బాబు అధ్యక్షతన ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజ్యసభ సభ్యుడు ప్రఫుల్ పటేల్, విశ్వహిందీ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం యూనివర్సిటీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముఖ్యఅతిథి ప్రఫుల్ పటేల్ మాట్లాడుతూ ఇటువంటి గొప్ప కార్యక్రమంలో పాల్గొనడం నాకు గర్వకారణంగా ఉందన్నారు. చాన్సలర్ మోహన్‌బాబు మాట్లాడుతూ ప్రఫుల్ పటేల్‌తో 1995లో మొదలైన పరిచయం బలమైన స్నేహంగా మారిందని తెలిపారు. మహారాష్ట్రకు చెందిన ప్రముఖ పాత్రికేయుడు, లోక్‌మత్ పత్రిక అధ్యక్షుడు విజయ్ జవహర్ దార్డా విద్యావేత్తగా, నేషనల్ కాంగ్రెస్ పార్టీలో మాజీ మంత్రిగా చేసిన సేవలను గుర్తుచేశారు. ఎంబీయూ ద్వారా 866 మంది విద్యార్థులు, శ్రీవిద్యానికేతన్ ఇంజినీరింగ్ కళాశాల నుంచి 1,698 మంది విద్యార్థులు గ్రాడ్యుయేషన్ పట్టాలను అందుకున్నారు.

డ్రమ్స్ శివమణి, విజయ్ జవహర్ దార్డాకు గౌరవ డాక్టరేట్లు

ప్రముఖ సంగీత విద్వాంసుడు, డ్రమ్స్ శివమణితో పాటు మహారాష్ట్రకు చెందిన లోక్‌మత్ పత్రిక అధినేత విజయ్ జవహర్ దార్డాకు గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేశారు. ఈ సంవత్సరం దేశంలోనే ప్రముఖ వ్యక్తులకు డాక్టరేట్ ఇచ్చామని, ఇది ఇలాగే కొనసాగుతుందని అని ప్రో చాన్సలర్ మంచు విష్ణు తెలిపారు. అనంతరం విశ్వహిందీ పరిషత్ అధ్యక్షులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌తో పాటు పలువురు ప్రముఖులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్ మహేశ్వరి, వైస్ చాన్సలర్ నాగరాజ్ రామారావు, రిజిస్ట్రార్ సారథి, డీఎఫ్ఏ రవిశేఖర్, సీజీఎస్ఓ వికాస్ సింగ్, డీన్లు, ప్రిన్సిపల్స్, విభాగాధిపతులు పాల్గొన్నారు.